క్లుప్తంగా

బాధితులను ఆదుకునేందుకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ సరోజనమ్మ తదితరులు

టెక్కలి: పిడుగుపాటు ప్రమాదంతో గొర్రెలు, మేకలు మృతి చెంది నష్టపోయిన పెంపకందారులకు ప్రభుత్వం నుంచి ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ అట్ల సరోజనమ్మ భరోసా ఇచ్చారు. మండలంలోని అయోధ్యపురం పంచాయతీ పరిధి దీపావళి గ్రామంలో గొర్రెలు, మేకల మందపై పిడుగు పడిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఎంపీపీ సరోజనమ్మ, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్‌తో పాటు నాయకులంతా దీపావళి గ్రామం చేరుకొని బాధితులను పరామర్శించారు. నష్టపోయిన వారికి పరిహారం అందేవిధంగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పశు సంవర్థకశాఖ ఏడీ జి.రఘునాథరావుకు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఎన్.శంకర్, బి.హరి, పి.మోహన్‌రావు, జి.మోహన్‌రెడ్డి, ఎస్.మోహన్, జి.అప్పలరెడ్డి, ఎ.రవి, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలు పరిష్కరించాలి'



డీటీ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మందస: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మహేంద్ర రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.విజయలక్ష్మికి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఇరిగేషన్‌కు సంబంధించిన కాలువలు, మదుములు మరమ్మతులు చేయాలన్నారు. జీడి పంటలకు దళారుల బెడద లేకుండా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, నాయకులు బదకల వెంకటరావు, జగన్నాథ బెహరా, డొక్కరి నారాయణరావు, కొర్ల హేమారావుచౌదరి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో రీసర్వే



మందసలో సర్వే చేస్తున్న అధికారులు

మందస: మేజర్ పంచాయతీ మందసను వివాదాలు వదలడం లేదు. సుమారు రూ.6 కోట్లతో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు బస్టాండ్‌లో ఎదురైన ఆటంకాలకు ముగింపు దొరకడం లేదు. బస్టాండ్‌లో విస్తరణ పనులు పూర్తి చేసినప్పటికీ, కొంత స్థలాన్ని ఆక్రమించుకున్నారని సంతోష్‌కుమార్ పాణిగ్రాహి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. దీంతో సంతోష్‌కుమార్ పాణిగ్రాహి సమక్షంలో బస్టాండ్‌లో కొలతలు చూడాలన్న కోర్టు ఉత్తర్వుల మేరకు తహసీల్దార్ బడే పాపారావు ఆధ్వర్యంలో ఐటీడీఏ, ఆర్‌అండ్‌బీ, సచివాలయం సర్వేయర్లు, సిబ్బంది సోమవారం సర్వే చేశారు. నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ డిక్కల విక్రం, సర్వేయర్లు మోహనరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలుగు అదృశ్యంపై విచారణ

- పోలీసుల సాయం కోరిన అటవీశాఖ



రుక్మిణమ్మను విచారిస్తున్న రేంజర్ మురళీకృష్ణనాయుడు

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్దిలో శనివారం రాత్రి మైలపల్లి రుక్మిణమ్మ ఇంటి పెరట్లోకి వచ్చిన అలుగును అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తీసుకెళ్లి ఇప్పుడు కనిపించడం లేదని చెబుతున్నారు. ఈ విషయం అటవీశాఖ దృష్టికి వెళ్లడంతో రుక్మిణమ్మ చెప్పినట్లు అలుగును తీసుకెళ్లిన ముగ్గురు వ్యక్తులు బైపల్లి తిరుపతి, కోడ దేవరాజు, దుమ్ము నూకరాజులను అధికారులు ఆదివారం విచారించారు. మరలా సోమవారం కాశీబుగ్గ సర్కిల్ రేంజర్ మురళీకృష్ణనాయుడు విచారణకు వచ్చారు. ఈ మేరకు లోతైన విచారణలో సహకరించాలని కవిటి ఎస్‌ఐ కె.రామును కోరారు. విచారణలో అటవీశాఖ సిబ్బంది రాఘవయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

ఐదు వాహనాలకు వేలంపాట

కాశీబుగ్గ: పలాస ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం ఎదురుగా సోమవారం ఐదు వాహనాలకు వేలంపాట నిర్వహించారు. పలాస ఎస్‌ఈబీ ఇన్‌చార్జ్ సీఐ కె.కృష్ణారావు నేతృత్వంలో జరిగిన వేలంపాటలో రెండు స్కూటీలు, గ్లామర్, డిస్కవర్, పల్సర్ వాహనాల వేలంపాటలో పదమూడు మంది పాటదారులు పాల్గొన్నారు. వేలంపాటలో జీఎస్టీతో కలిపి రూ.1,15,000లకు వాహనాలను దక్కించుకున్నారు.

సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు



కోటబొమ్మాళి: సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

మందస: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా ఆధార్ కార్డుల అప్‌డేషన్స్ పూర్తి చేయాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు సూచించారు. మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేషన్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఐదు రోజుల పాటు 19 కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సిబ్బంది శతశాతం లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఆధార్ అప్‌డేట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఇప్పిలి వెంకటరమణ పలు ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను పరిశీలించారు.

29 వరకు ఆధార్ మొబైల్ క్యాంప్

ఇచ్ఛాపురం రూరల్: ఈనెల 29వ తేదీ వరకు ఈదుపురం, తేలుకుంచి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. ఈదుపురం సచివాలయంలో 20వ తేదీన ఈదుపురం, 21న బూర్జపాడు, కేశపురం పంచాయతీలు, 27న కొఠారీ, 28న తులసిగాం, 29న లొద్దపుట్టి గ్రామ పంచాయతీల ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అదే విధంగా తేలుకుంచి గ్రామ సచివాలయంలో 20న తేలుకుంచి, 21న కీర్తిపురం, కొళిగాం, 27న బిర్లంగి, 28న అరకభద్ర, కేదారిపురం, 29న బాలకృష్ణాపురం, మండపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆధార్ డ్రైవ్ కేంద్రాల పరిశీలన

కంచిలి: మండలంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ కేంద్రాల పనితీరును ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కంచిలి-2 సచివాలయంలో స్పెషల్ డ్రైవ్ ఏవిధంగా జరుగుతోందో తెలుసుకున్నారు. మంగళవారం సైతం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కంచిలి-2, మండపల్లి, మఠం సరియాపల్లి, డి.జి.పురం సచివాలయాల్లో నిర్వహిస్తారని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోటబొమ్మాళి: మండలంలోని కోటబొమ్మాళి, దంత, మహసామెబ్‌పేట, హరిశ్చంద్రపురం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపు కేంద్రాలు సోమవారం ప్రారంభించారు. రోజుకు 60 మంది ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు.



కంచిలి: ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



మందస: ఆధార్ సేవలు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు



కవిటి: సూచనలిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

కవిటి: రానున్న వేసవి సీజన్‌లో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమకు నిర్దేశించిన మేరకు వారంలో రెండు రోజులు సచివాలయంలోని అన్ని పాఠశాలలను పరిశీలించి, జగనన్న గోరుముద్ద, జేవీకే కిట్లు ఇతర ప్రభుత్వ పథకాల పనితీరును యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, ఏపీఎం కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: వేసవిలో గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.రామారావు సూచించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆధార్ మొబైల్ క్యాంప్, పంచాయతీ రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు.

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని బోరుబావులు, తాగునీటి కుళాయిలు పనిచేయకపోతే సమస్యలను 77803 74690 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేస్తే, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

నందిగాం: మండల కేంద్రానికి చెందిన కురమాన తులసీరావు ఇటీవల మరణించారు. దీంతో అతనికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను అతని భార్య రాధికకు వైఎస్సార్‌సీపీ నాయకుడు జడ్యాడ జయరాం చేతులమీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరారు. ఈ మేరకు సీడీపీవో పి.నాగరాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రాడ్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్లకు వయో పరిమితి పెంచాలని కోరారు.

ఇచ్ఛాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని అర్బన్ అంగన్‌వాడీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎం.జయలక్ష్మి, హైమా, ఢిల్లేశ్వరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీపీజేఏసీ మండల అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో సోమవారం నిరసన తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.గురుప్రసాద్, పి.వాణి, సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ లేబర్ కాలనీకి వెళ్లేదారిలో ఉన్నటువంటి ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని అధికారులు సోమవారం పరిశీలించారు. 20వ వార్డు పరిధిలో ఉన్నటువంటి ఈ స్థలం కేటీరోడ్డుకు, పలాస ఆర్టీసీ కాంప్లెక్సుకు ఆనుకొని ఉండడంతో కొంతమంది ఆక్రమించడానికి యత్నిస్తున్నారని స్థానిక కౌన్సిలర్ అంబటి మాధురి పేర్కొన్నారు. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సీతారామయ్య, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ లెనిన్ స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి పది రోజుల్లో విచారించి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు. వారితో పాటు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు ఉన్నారు.

55 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కంచిలి: మండలంలోని జలంత్రకోట గ్రామంలో హెల్పేజ్ ఇండియా సౌజన్యంతో, సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 55 మందికి డాక్టర్ వి.కిరణ్‌కుమార్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. మరో 15 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.బ్రహ్మానందం, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న శిష్టు గోపి తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 19వ వార్డు సూదికొండ రెల్లివీధిలో మంచినీటి బోరు పాడైపోయింది. దీంతో స్థానికులు ఈ విషయాన్ని కౌన్సిలర్ శిష్టు బృందావతి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆమె స్పందించి తన సొంత నిధులతో బోరు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిష్టు గోపి పరిశీలించారు.

దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఇచ్ఛాపురం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కంచిలి: దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు కృష్ణకుమార్

కంచిలి: ప్రతి ఒక్కరూ దంతాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి దంత వైద్యుడు కె.కృష్ణకుమార్ సూచించారు. మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో ప్రపంచ దంత ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాం-నేషనల్ హెల్త్ మిషన్' కార్యక్రమాన్ని సోంపేట సీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఇక్కడ అనాథలు, వృద్ధులు, వికలాంగులకు దంత వైద్య పరీక్షలను చేపట్టారు. దంత సంరక్షణ, కేన్సర్ నిర్మూలనపై అవగాహనను కల్పించారు. మాణిక్యపురం పీహెచ్‌సీ సిబ్బంది సైతం సేవలందించారు. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: నోటి ఆరోగ్యం పూర్తి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని వైద్యాధికారి డా.ఎస్.అనూష అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డా.రమేష్‌నాయుడు, డా.దేవేంద్రరెడ్డి, డా.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కాశీబుగ్గ: పలాస, మందస మండలాల మధ్య ఉన్నటువంటి ఉజ్జిడి మెట్ట ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించి 1బీ, అడంగల్‌లు జారీ చేయాలని పలాస ఆర్డీవో సీతారామమూర్తికి రైతులు సోమవారం స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. వారం రోజుల్లో సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు చాపర వేణుగోపాల్, వంకల మాధవరావు, నెయ్యిల గణపతి, పిన్నింటి నాగేశ్వరరెడ్డి, జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి టీం సభ్యులు

సోంపేట: మహిళల భద్రతకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స్ఫూర్తి టీం సభ్యులు పేర్కొన్నారు. సోంపేట పోలీసు శాఖ స్ఫూర్తి టీం ఆధ్వర్యంలో మండలంలోని పలాసపురం జెడ్పీ హెచ్ స్కూల్ మహిళా భద్రతపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొఠారీ పంచాయతీకి చెందిన దక్కత మహంకాళి అనే వ్యక్తి కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ఆదే గ్రామానికి చెందిన కువైట్‌కు చెందిన ప్రవాసాంధ్రులు, రూ.15 వేలను వైఎస్సార్‌సీపీ నాయకుడు దుక్క ఆనంద్ చేతులు మీదుగా అందజేశారు.

ఎమ్మెల్సీ నర్తుకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సుగుణ తదితరులు

కవిటి: ఎమ్మెల్సీ నర్తు రామారావుకు కొత్త పుట్టుగలోని తన నివాసంలో పలువురు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నాయకులు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్లా సుగుణ, దేవరాజ్, ఇప్పిలి కృష్ణారావు, బి.నిర్మలారెడ్డి, బి.రమణమూర్తి తదితరులు ఉన్నారు.

మేమున్నామని..!



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ఇచ్ఛాపురం: పక్షవాతంతో మంచానికే పరిమితమైన వ్యక్తికి మేమున్నామని అండగా నిలిచారు అతని స్నేహితులు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలోని ఎస్సీ వీధికి చెందిన సతివాడ హేమాంబర్ ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో తలకు తీవ్రగాయమై పక్షవాతానికి గురయ్యాడు. దీంతో ఎడమ చేయి, కాలు కదలక మంచానికే పరిమితమయ్యాడు. ఇతను పట్టణంలోని ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు.

పేద కుటుంబ కావడంతో ప్రస్తుతం వైద్యం చేయించే స్తోమత లేక కుటుంబ సభ్యులు ఆర్థికంగా సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు (స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో 1996-97 విద్యనభ్యసించిన విద్యార్థుల సంఘం) వైద్యం ఖర్చుల కోసం రూ.40 వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. కోలుకునేవరకు అండగా ఉంటామని స్నేహితుడి కుటుంబానికి భరోసా కల్పించారు.

స్పందనకు 15 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పరిపాలనాధికారి పద్మావతి

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి వై.వి.పద్మావతి సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా 15 వినతులు అందాయి. మేజర్ పంచాయతీ పరిధి భవానీనగర్‌లో మురుగు కాలువలు నిర్మించాలని ఆ కాలనీ ప్రజలు విన్నవించారు. వితంతు పింఛన్‌తో పాటు ఇంటి స్థలం మంజూరు చేయాలని టెక్కలి కొండ్రవీధికి చెందిన దుంప వాగ్దేవి కోరారు. తనకు ఇంటి స్థలంతో పాటు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన సేనాపతి రాధ విన్నవించారు. కోటబొమ్మాళి మండలం బలరాంపురం గ్రామంలో సర్వే నంబర్ 319-11లో సాగునీటి కాలువ ఆక్రమణను అడ్డుకోవాలని రైతులు కోరారు. సంతబొమ్మాళి మండలం తోటాడ ఆర్బీకే పరిధిలో ధాన్యం కొనుగోలు పరిధిని పెంచాలని సర్పంచ్ వై.సునీత విన్నవించారు. ఇలా పలు వినతులు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు.

బంద్ విజయవంతం



బంద్‌లో పాల్గొన్న సెంట్రింగ్ కార్మిక సంఘ సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో సెంట్రింగ్ కార్మికులు సోమవారం నిర్వహించిన బంద్ విజయవంతమయ్యింది. ఈ సందర్భంగా పలాస సీతమ్మతల్లి మందిరం వద్ద మణికంఠ సెంట్రింగ్ యూనియన్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కుప్పిలి వైకుంఠరావు మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికులకు పదేళ్ల క్రితం ధరలే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేకులు, రాకపోకల అద్దెలు, ప్లాస్టర్‌తో పాటు ఇతర సామాగ్రి ఖర్చులు పెరుగుతున్నాయని తెలియజేశారు. అందువలన ప్రస్తుతం ఉన్నటువంటి ధరలకు అధికంగా అడుగుకు రూ.2 లు పెంచడానికి ఆశిస్తున్నామని పేర్కొన్నారు. మేస్త్రీలు, ఇళ్ల నిర్మించే కార్మికులు తమ ఇబ్బందులు అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇప్పిలి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నర్సిపురం రామారావు, కార్యదర్శి గణియా మోహన్‌రావు, క్యాషియర్ మజ్జి పాపారావు, రంది పోలయ్య, పాపారావు, ధనుంజయ, తిరుపతి, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొమరల్తాడ గ్రామంలో వెలుగు, జీడి రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ది యంగ్ స్టార్ హెల్పింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో చిరుధాన్యాల ప్రయోజనాలపై అవగాహన కలిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనేక పోషక విలువలు కలిగిన జొన్నలు, కొర్రలు, సజ్జలు, సామలు, రాగులు, మినుములు, ఉలవల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, కాంతమ్మ, కె.మోహిని, మహేష్ తదితరులు పాల్గొన్నారు.